నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, సోమవారం 23 జూన్ 2025 | KHAMMAM

# కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- ఎన్నికల హామీల్లో ఏ ఒక్కదానిని పక్కాగా అమలుచేయలేదు
- అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులెవరికీ వర్తింపజేయలేదు
- సర్కారు వైఫల్యాన్ని ఎండగట్టేందుకు నేడు ధర్నాలు చేస్తాం
- ప్రభుత్వ కార్యాలయాల్లో వినతులు ఇస్తాం: రేగా కాంతారావు



భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 22 (నమస్తే తెలంగాణ): ప్రజా సమస్యలను పరిష్కరించడంలోనూ, ప్రజలకు మెరుగైన పాలన అందించడంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు విమర్శించారు. ఎన్నికల హామీల్లో ఏ ఒక్కదానికీ పక్కాగా అమలుచేయలేదని, ప్రభుత్వ పథకాలను అర్హులెవరికీ వర్తింపజేయలేదని విమర్శించారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతూ భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా తమ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు 'నమస్తే తెలంగాణ'తో ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వంతఅమతతలు చేయాల్సిన ఎన్నికల హామీలను, పరిష్కరించాల్సిన ప్రజా సమస్యలను వినతిపత్రాల్లో పొందుపర్చామని అన్నారు. ఆ వినతులను పంచాయతీ కార్యాలయల్లోనూ, మండల కార్యాలయాల్లోనూ, మున్సిపల్ కార్యాలయాల్లోనూ అధికారులకు అందజేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతులుల సమస్యలపై ధర్నాలు చేయనున్నట్లు చెప్పారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, సైడు కాలువల్లో పేరుకపోయిన మురుగును తొలగించాలని, గ్రామాల్లో వీధిలైట్లు వేయించాలని, చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, అర్హులైన రైతులందరికీ రైతుభరోసా ఇవ్వాలని, విత్తనాలు, ఎరువులు, విత్తనాలను సబ్సిడీపై అందించాలని, పోడు గిరిజనులపై దాడులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నాలు నిర్వహించి వినతిపత్రాలు అందించనున్నట్లు చెప్పారు. ఈ ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా శ్రేణులకు పిలుపునిచ్చారు. కాగా, ఇల్లెందు నియోజకవర్గంలో జరిగే ధర్నాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.

# స్ఫూర్తినిచ్చిన 'సండే బ్రిక్స్ చాలెంజ్'

**పర్యావరణానికి హాని చేయనివి ఈ 'సీఎస్ఈబీ బ్రిక్స్': భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్**



బ్రిక్స్ తయారీలో పాల్గొన్న యువతకు టోపీలు, టీషర్టులను అందజేస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం అర్బన్, జూన్ 22: కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో జరిగిన 'సండే బ్రిక్స్ చాలెంజ్' ఉద్యోగులతో పాటు సామాన్య ప్రజల్లో స్ఫూర్తి నింపిందని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎస్ఈబీ బ్రిక్స్ రూపకర్త, బెంగళూరుకు చెందిన సుధాకర్‌రెడ్డి సలహాలకు అనుగుణంగా 168 మంది ప్రజలు పాల్గొని ఏడు మిషన్ల ద్వారా 300కు పైగా సీఎస్ఈబీ బ్రిక్స్ తయారు చేశారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ టీషర్టు, టోపీలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన దగ్గరలో ఉన్న వనరులను ఉపయోగించుకొని పర్యావరణానికి ఎటువంటి హాని కలుగకుండా ఈ ఇటుకలు తయారు చేసుకోవచ్చని అన్నారు. తయారీ ఖర్చు కూడా చాలా తక్కువ అవుతుందని, ఈ ఇటుకలతో చేపట్టే నిర్మాణాలకు ప్లాస్టరింగ్ కూడా చేయాల్సిన అవసరం లేదని వివరించారు. డీఈవో వెంకటేశ్వరచారి, జిల్లా విద్యాశాఖ కో ఆర్డినేటర్లు సైదులు, నాగరాజు శేఖర్, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ సుజాత, డీఆర్‌డీఏ అధికారులు, మెప్మా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలు రాకముందే వైరల్ జ్వరాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను వణికిస్తున్నాయి. దగ్గు, జలుబు, గొంతునొప్పి, ఒళ్లునొప్పులతో ప్రజలు చతికిలబడుతున్నారు. వైరల్ జ్వరాలతో ఇంటికే పరిమితమవుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో వైద్యశాఖ గ్రామాల్లో ర్యాపిడ్ సర్వే చేస్తున్నది. గొత్తికోయల గ్రామాలే టార్గెట్‌గా వైద్యాధికారులు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే చేపడుతున్నారు. కానీ.. వైరల్ జ్వరాలతో మాత్రం జనం వణికిపోతున్నారు.
- భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 22 (నమస్తే తెలంగాణ)



మలేరియా ర్యాపిడ్ సర్వేలో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్ స్పందన (ఫైల్)

# వణికిస్తున్న వైరల్



గొత్తికోయల గ్రామంలో గిరిజనులను పరీక్షించి మందులను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)



- వర్షాలు రాకముందే పీడిస్తున్న జ్వరాలు
- జలుబు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులతో చతికిలపడుతున్న ప్రజలు
- మలేరియాపై వైద్యశాఖ ముందుచూపు ఎంతవరకు?
- ఇన్‌చార్జిలే మానిటరింగ్ ఆఫీసర్లు
- హైరిస్క్ ఏరియాల్లో మాత్రమే ర్యాపిడ్ సర్వేలు
- గతేడాది 185 మలేరియా కేసులు
- వెంటాడుతున్న మందుల కొరత సమస్య

భద్రాద్రి జిల్లాలో పారిశుధ్య లోపంతో ఏటా జ్వరాలు విజృంభిస్తున్నాయి. వైద్యారోగ్యశాఖ శిబిరాలు ఏర్పాటు చేసినా సీజన్‌లో మాత్రం మలేరియా కేసుల నమోదు తగ్గడం లేదు. గతేడాది జిల్లాలో 185 మలేరియా కేసులు నమోదయ్యాయి. 16 డెంగీ కేసులు కూడా నమోదైనట్లు ఆరోగ్య శాఖ లెక్కలు చెబుతున్నాయి. కేవలం వలస గ్రామాల్లోనే వైద్యాధికారులు ముందస్తు చర్యలు చేపడుతూ.. మిగతా గ్రామాలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వానకాలం వచ్చిందంటే చాలు వసతి గృహాలు, గిరిజన గ్రామాల్లో జ్వరాల బాధితుల సంఖ్య పెరిగిపోతున్నది. వలస గ్రామాల్లో ఉన్న రోగులు అన్ని ప్రాంతాల్లో పనులు చేస్తుండడంతో మలేరియా వ్యాప్తి చెందుతున్నదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే జిల్లాలో 27 మలేరియా పాజిటివ్ కేసులు, 5 డెంగీ కేసులు నమోదయ్యాయి.

## హైరిస్క్ ఏరియాల్లోనే ర్యాపిడ్ సర్వేలు

ఏటా మలేరియా, డెంగీ జ్వరాలు జనాల్ని పట్టిపీడిస్తున్నా హైరిస్క్ ప్రాంతాల్లో మాత్రమే వైద్య శాఖ ర్యాపిడ్ సర్వే చేసి వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నది. ప్రస్తుతం జిల్లాలో 190 హైరిస్క్ గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లో జ్వరాలు ఉన్న వారి రక్త నమూనాలు సేకరిస్తున్నారు. దీంతోపాటు దోమల మందు పిచికారీ చేస్తున్నారు. వసతి గృహాలు ఉన్న చోట కూడా దోమల మందు పిచికారీ చేస్తున్నారు.

## వెంటాడుతున్న మందుల కొరత

జిల్లాలోని ప్రతీ మండలంలోనూ ఆసుపత్రులు ఉన్నా మందుల కొరత సమస్య మాత్రం తీవ్రంగా వెంటాడుతున్నది. ప్రతీ ఏటా ఈ సమస్య ఉంటుందని అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం గమనార్హం. దీంతో పేదలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి జేబులు గుల్లచేసుకుంటున్నారు.


### వైరల్ జ్వరాలు వస్తున్నాయి..



నాకు జ్వరం ఒక్కరోజే ఉంది.. కానీ.. వారం రోజులు ఒళ్లు నొప్పులు ఉన్నాయి. దోమలు పెరిగితే మలేరియా జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖరీదైన మందుల్లేవు. మా మండలంలో వలసవాదులు ఎక్కువగా ఉన్నారు. రాకపోకలు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఆ గ్రామాల్లో రోగాలను నియంత్రించకపోతే ప్రమాదమే.

**–అనగంటి బాలకృష్ణ, చినబండిరేవు, దుమ్ముగూడెం**

### ముందస్తు చర్యలు చేపడుతున్నాం..



మలేరియా నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ర్యాపిడ్ సర్వే చేశాం. మలేరియా లక్షణాలు లేనివారిని కూడా పరిగణనలోకి తీసుకున్నాం. 160 గ్రామాల్లో రెండు విడతలు సర్వే చేసి జ్వరాల బాధితులను గుర్తించి మందులు ఇచ్చాం. వానలు పడితే జ్వర బాధితుల సంఖ్యం పెరుగుతుంది. నీరు నిల్వ ఉన్నచోట ఆయిల్‌బాల్స్ వేస్తాం. గంబూషియా చేపలను కూడా పెంచుతున్నాం. ఇందుకోసం ప్రత్యేక ప్రోగ్రాం అధికారి ఉన్నారు. మందుల సమస్య ఎక్కడా లేదు. ప్రోగ్రాం అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. **– డాక్టర్ భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌వో, భద్రాద్రి**

# ఆయిల్‌ఫెడ్‌కు కేంద్ర ఎస్టీ కమిషన్ నోటీసులు

**ఏడేళ్లు దాటినా పామాయిల్ మొక్కలు కాపు రాలేదంటూ రైతు చేసిన ఫిర్యాదుపై స్పందన**

దమ్మపేట రూరల్, జూన్ 22: హైదరాబాద్‌లో ఈ నెల 23న జరిగే విచారణకు హాజరుకావాలని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ సంస్థకు కేంద్ర ఎస్టీ కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఆయిల్‌ఫెడ్‌తోపాటు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి, ఉద్యానశాఖ సంచాలకులు, ఫిర్యాదిదారుడు కారం శ్రీరాములు సైతం హైదబాద్‌లోని దిల్‌కుష్ అతిథిగృహంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు హుసేన్ ఎదుట విచారణకు హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నది. వివరాల్లోకెళ్తే.. ఈ ఏడాది మార్చి 18న భద్రాద్రి జిల్లాలో పర్యటిస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడికి గిరిజన పామాయిల్ రైతు కారం శ్రీరాములు ఆయిల్‌ఫెడ్‌పై ఫిర్యాదు చేశాడు. మూడేళ్లు దాటిన తరువాత పామాయిల్ గెలలు కాస్తాయని చెప్పి ఆయిల్‌ఫెడ్ అధికారులు నాసిరకం, జన్యు లోపాలున్న మొక్కలను అంటగట్టారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఏడేళ్లు దాటినా పామాయిల్ మొక్కలు కాపు రాలేదని, సమస్యను ఆయిల్‌ఫెడ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని అన్నాడు. తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. దీంతో స్పందించిన ఎస్టీ కమిషన్ ఈ నెల 23వ తేదీన విచారణకు హాజరుకావాలని నాలుగు రోజుల క్రితం నోటీసులు జారీ చేసింది. హాజరుకాకపోతే సివిల్ కోర్టు అధికారాలను ఉపయోగించి చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొంది.



**ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయకుండా సర్దుబాటుకు శ్రీకారం చుట్టింది కాంగ్రెస్ సర్కార్. ఇప్పటికే ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయగా జిల్లా విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయుల వివరాలతో సిద్ధంగా ఉన్నారు. బడిబాట కార్యక్రమం తర్వాత తాత్కాలిక బదిలీలు చేపట్టనున్నారు. అయితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కొత్త నిబంధనలతో విద్యార్థులకు తీవ్రనష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులపైనా పని వత్తిడి మరింత పెరుగుతుందని మదనపడుతున్నారు.** –అశ్వారావుపేట, జూన్ 22

- బడిబాట తర్వాత టీచర్ల తాత్కాలిక బదిలీలు
- వివరాలతో రెడీగా ఉన్న భద్రాద్రి జిల్లా విద్యాశాఖ
- వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

# 'సర్దుబాటు'కు సిద్ధం!

ప్రభుత్వ ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటుకు నిర్ణయించింది. విద్యార్థుల చదువుకు ఎటువంటి ఆటంకం కలుగకూడదని కాంగ్రెస్ ప్రభుత్వం పరోక్ష సంకేతాలు ఇస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల ఖాళీల భర్తీని మరికొంతకాలం సాగదీయాలనే ఉద్దేశంతో ఉన్నట్లు ఉపాధ్యాయ సంఘాలు అనుమానిస్తున్నాయి. ఉపాధ్యాయుల కొరతను అధిగమించేలా సర్దుబాటు చేయాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి మే 28వ తేదీన ఉత్తర్వులు జారీ అయ్యాయి. సబ్జెక్ట్ నిర్దిష్ట అవసరం, పాఠశాలల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయుల సర్దుబాటు బాధ్యతను జిల్లా కమిటీకి అప్పగించింది. గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలలకు ఉపాధ్యాయుల సర్దుబాటు చేయకూడదనే నిబంధనలు ఉన్నాయి. అయినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఖాతరు చేయడం లేదు.



ప్రభుత్వ పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

### బడిబాట కార్యక్రమం తర్వాతే..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంచే లక్ష్యంతో విద్యాశాఖ బడిబాట ప్రోగ్రాం చేపట్టింది. ఉచిత విద్య, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, దుస్తుల పంపిణీ వంటి అనేక పథకాలపై ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థుల ప్రవేశాలు పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో యూడైస్ ఆధారంగా ఉపాధ్యాయులు సర్దుబాటు ముందుగానే చేస్తే వచ్చే ఇబ్బందులను గుర్తించిన విద్యాశాఖాధికారులు బడిబాట కార్యక్రమం పూర్తి అయిన తర్వాతనే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలనే నిర్ణయాన్ని వాయిదా వేశారు. బడిబాట తర్వాత ఉపాధ్యాయులు ఎక్కడ అవసరమో.. ఎక్కడ మిగులు ఉన్నారో స్పష్టంగా తేలనుంది.

### సర్దుబాటుకు నిబంధనలు..

ఉపాధ్యాయుల సర్దుబాటుకు ప్రభుత్వం నిబంధనలను పేర్కొంది. గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. ఒకే ప్రాంగణంలో రెండు ప్రాథమిక పాఠశాలలు లేదా ఒక ఉన్నత, ఒక ప్రాథమిక పాఠశాల ఉంటే వాటిని ఒక యూనిట్‌గా తీసుకోవాలి. అవసరాన్ని బట్టి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి. ఇంకా మిగులు ఉపాధ్యాయులు ఉంటే ఇతర అవసరమైన పాఠశాలలకు పంపించాలి. గ్రామ పంచాయతీలో అవసరం లేకుంటే మండలం యూనిట్‌గా, ఒకవేళ మండలంలో కూడా అవసరం లేకుంటే ఇతర మండలాలకు కూడా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే అవకాశం కల్పించింది.

### ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవుతాయి..



ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం జారీ చేసిన ఉత్తర్వుల వల్ల విద్యార్థులకు తీరని నష్టం జరుగుతుంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కంటే నిర్వీర్యమయ్యే ప్రమాదమే ఎక్కువగా ఉంది. అందుకే సర్దుబాటు ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకొని ఉపాధ్యాయుల సంఖ్యను పెంచాలి. ప్రభుత్వ నిర్ణయాలు విద్య అభ్యున్నతికి దోహదపడేలా ఉండాలే గానీ నష్టంచేసేలా ఉండకూడదు.

**–హలావత్ హరిబాబు, టీజీటీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అశ్వారావుపేట**

### వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు..

ప్రభుత్వ ఉపాధ్యాయుల సర్దుబాటు నిర్ణయాన్ని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను పెంచాలని సూచిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయకుండా నిర్వీర్యం చేసే విధంగా ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయంటూ మండిపడుతున్నారు. ఒకవేళ సర్దుబాటు చేయాలనుకుంటే పాత ఉత్తర్వుల మేరకు చేపట్టాలని కోరుతున్నాయి.



# బదిలీల వేటు!

- భద్రాద్రి జిల్లా రెవెన్యూ శాఖలోని అవినీతి వ్యవహారాలపై కలెక్టర్ సీరియస్?
- ఏసీబీ దాడులు జరిగిన కార్యాలయాల యంత్రాంగంపై క్రమశిక్షణ చర్యలు!
- లంచం లెక్కిస్తూ సోషల్ మీడియాకు చిక్కిన అశ్వాపురం తహసీల్దార్‌పై వేటు
- కలెక్టరేట్‌కు 'రాజారావు' అటాచ్.. అశ్వాపురానికి ఐటీడీఏ ఆర్‌వోఎఫ్ఆర్ డీటీ
- బూర్గంపహాడ్ డిప్యూటీ తహసీల్దార్‌గా కలెక్టరేట్ సూపరింటెండెంట్ రషీద్
- ఐటీడీఏ ఆర్‌వోఎఫ్ఆర్ డీటీగా బూర్గంపహాడ్ డీటీ రాంనరేశ్‌కు స్థానచలనం
- లంచాలు, ఏసీబీ దాడుల నేపథ్యంలో 24 గంటల్లోపే భద్రాద్రి కలెక్టర్ యాక్షన్



బదిలీ వేటు పడిన రాజారావు




బూర్గంపహాడ్/ అశ్వాపురం, జూన్ 22: భద్రాద్రి జిల్లాలోని రెవెన్యూ శాఖలో జరుగుతున్న అవినీతి వ్యవహారాలను కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సీరియస్‌గా పరిగణించారు. బూర్గంపహాడ్ తహసీల్దార్ కార్యాలయ టైపిస్టు (కంప్యూటర్ ఆపరేటర్) రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కడం, ఏకంగా అశ్వాపురం తహసీల్దారే ఓ రైతు నుంచి లంచం తీసుకుంటున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడం వంటి అంశాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సదరు అశ్వాపురం తహసీల్దార్‌పై బదిలీ వేటు వేశారు. ఈ మేరకు తన కార్యాలయానికే అటాచ్ చేసుకున్నారు. ఇక అవినీతి అంశంలో చెరిగిపోని మచ్చ తెస్తూ వరుసగా ఏసీబీ అధికారులకు చిక్కుతున్న రెవెన్యూ కార్యాలయాల్లో ఇతర యంత్రాంగంపైనా బదిలీ వేటు వేశారు. ఇక సంచలనంగా మారిన అశ్వాపురం మండల రెవెన్యూ కార్యాలయానికి తహసీల్దార్‌గా భద్రాచలం ఐటీడీఏ ఆర్‌వోఎఫ్ఆర్ డీటీని పంపుతున్నారు. అలాగే, బూర్గంపహాడ్ డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) రాంనరేశ్‌ను కూడా భద్రాచలం ఐటీడీఏ ఆర్‌వోఎఫ్ఆర్ డీటీగా బదిలీ చేశారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్ రషీద్‌ను బూర్గంపహాడ్ డీటీగా పంపుతున్నారు. కాగా, లంచాలు, ఏసీబీ దాడులతో బూర్గంపహాడ్, అశ్వాపురం మండలాల్లో రెవెన్యూ కార్యాలయాల ప్రతిష్ఠ మంటగలుస్తున్న నేపథ్యంలో 24 గంటల్లోపే ఆయా కార్యాలయాల యంత్రాంగంపై భద్రాద్రి కలెక్టర్ చర్యలు తీసుకున్నారు.

అవినీతి, లంచాలకు కేంద్రాలుగా ఉంటున్న అశ్వాపురం, బూర్గంపహాడ్ కార్యాలయాల్లోని యంత్రాంగంపై భద్రాద్రి కలెక్టర్ సీరియస్ అయ్యారు. రేషన్ కార్డు ప్రాసెస్ కోసం ఓ దరఖాస్తుదారుడి నుంచి రూ.2,500 లంచం తీసుకుంటూ బూర్గంపహాడ్ తహసీల్దార్ కార్యాలయ టైపిస్ట్ నవక్రాంత్ శనివారం ఏసీబీకి పట్టుబడిన విషయం విదితమే. అలాగే, అశ్వాపురం తహసీల్దార్ రాజారావు కూడా ఓ రైతు వద్ద లంచం తీసుకొని లెక్కిస్తూ సోషల్‌మీడియాకు చిక్కిన సంగతి తెలిసిందే. అశ్వాపురం మండలంలో మల్లెలమడుగు గ్రామానికి చెందిన ఓ రైతు తన పట్టాదారు పాస్‌పుస్తకంలో పేరు మార్పు కోసం దరఖాస్తుతో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాడు. ఆన్‌లైన్ చేయాలంటే రూ.7 వేలు ఇవ్వాలంటూ సదరు రైతును తహసీల్దార్ డిమాండ్ చేశారు. తన వద్ద రూ.5 వేలే ఉన్నాయంటూ ఆ రైతు చెప్పడంతో ఆ నగదును తీసుకొని లెక్కిస్తూ.. 'మరో రూ.1000 ఇవ్వాలి' అంటూ తహసీల్దార్ అడిగిన విషయాన్ని పక్కనే ఉన్న మరో రైతు తన సెల్‌ఫోన్‌లో రికార్డుచేశాడు. ఆ వీడియో రికార్డును సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయడంతో అది వైరల్‌గా మారింది. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో సదరు తహసీల్దార్ రాజారావును కలెక్టరేట్‌కు అటాచ్ చేస్తూ కలెక్టర్ జితేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఆయన స్థానంలో మణిధర్ సోమవారం విధుల్లోకి రానున్నారు. అయితే, అటు అశ్వాపురం, ఇటు బూర్గంపహాడ్ తహసీల్దార్ కార్యాలయాల్లో అవినీతి జలగల విషయం బయటపడిన 24 గంటల్లోనే ఆయా బాధ్యులపై భద్రాద్రి కలెక్టర్ చర్యలకు ఉపక్రమించారు.



బూర్గంపహాడ్ తహసీల్దార్ కార్యాలయం (ఫైల్)

### అశ్వాపురంలో 3 నెలల క్రితమే ఏసీబీకి చిక్కిన ఏవో..

అశ్వాపురం మండల వ్యవసాయ అధికారి సాయి శాంతన్‌కుమార్ కూడా మూడు నెలల క్రితమే ఏసీబీకి చిక్కారు. పత్తి కొనుగోలు కోసం ఓ రైతుకు టీఆర్ ఇవ్వడానికి అతడి వద్ద రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఈ ఏడాది ఫిబ్రవరి 20న సదరు ఏవో అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన విషయం విదితమే.



ఫిబ్రవరి 20న ఏసీబీకి చిక్కిన అశ్వాపురం ఏవో (ఫైల్)